క్లుప్తంగా

ఈ–క్రాప్‌లో తప్పిదాలు లేవు



ఈ–క్రాప్ వివరాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటరెడ్డి

అమడగూరు: ప్రభుత్వ ఆదేశాలతో ఆర్బీకే సిబ్బంది చేపట్టిన ఈ–క్రాప్ బుకింగ్‌లో తప్పిదాలు జరగలేదని తహసీల్దార్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సూపర్‌చెక్‌లో భాగంగా తుమ్మల గ్రామ పంచాయతీలోని మలకవారిపల్లి తండాలో పొలాలను తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ–క్రాప్ బుకింగ్ పకడ్బందీగా చేపట్టడంతో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోలేదన్నారు. పక్కాగా పంటలు సాగు చేస్తేనే ఈ–క్రాప్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇలా చేయడం ద్వారా అర్హులైన రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా దాదాపు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తియిందని తెలిపారు. ఈ–కేవైసీ త్వరగా పూర్తి చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఈశ్వరయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి'పై శిక్షణ

కనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 8 గంటలకు 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి'పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



రామసాగరంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుక్కపట్నం మండలం యాదాలంకపల్లి గ్రామ పంచాయతీ రామసాగరంలో రూ.5 లక్షల సొంత నిధులతో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ సత్యవతి వాటర్ ప్లాంట్ నిర్మించారు. బుధవారం వాటర్ ప్లాంట్‌ను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలు తెలుసుకుంటామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సహకార సంఘం అధ్యక్షుడు విజయారెడ్డి, వైస్ ఎంపీపీ ఆదినారాయణ, మండల అగ్రి అడ్వైజరీ చైర్మన్ వెంకటచౌదరి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని బోయ రామన్నగారిపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. కుటాగుళ్లకు చెందిన చంద్ర, బాబా ఇద్దరూ కలసి బోయ రామన్నగారిపల్లి సమీపంలో రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో చలమకుంట్లపల్లి వైపు నుంచి కదిరికి వస్తున్న ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్ర, బాబాకు రక్తగాయాలయ్యాయి. వీరిని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇద్దరికీ కాళ్లు విరిగినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు అవుట్ పోస్టు పోలీసులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మోడల్ పాఠశాల విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–19 హ్యాండ్‌బాల్ పోటీలకు పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ అజీంబాషా తెలిపారు. ఇటీవల అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారన్నారు. భానుప్రకాష్, ఆదర్శ్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది. జాతీయ స్థాయికి ఎంపికై రాణించాలని ఆకాంక్షించారు.

సంపూర్ణ ఆరోగ్యమే 'సురక్ష' లక్ష్యం



ధర్మవరంలో సురక్ష బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



గాండ్లపెంట మండలం మలమీదపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం



ముదిగుబ్బ మండలం కొండగట్టుపల్లిలో మాట్లాడుతున్న అధికారులు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రామ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. పేదలకు అందిస్తున్న వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. దృష్టిలోపం ఉన్న వారికి ప్రభుత్వం మంజూరు చేసిన కళ్లద్దాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు ఉచితంగా ఆపరేషన్లు, రూ.లక్షలు విలువ చేసే వైద్యాన్ని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అందించడం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ప్రతి 30 వేల జనాభాకు ఒక ఆసుపత్రి, ప్రతి సచివాలయం యూనిట్ పరిధిలో ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారని తెలిపారు. 50 వేల మందికి పైగా వైద్య సిబ్బందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని కొనియాడారు. గత 20రోజులుగా ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆశావర్కర్లు వైద్య సిబ్బంది సమష్టిగా డోర్ టు డోర్ సర్వే చేసి జబ్బులున్న వారికి 8 రకాల రక్త పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. పేదలు వైద్య ఖర్చులకు ఒక్క పైసా కూడా వెచ్చించకుండా పూర్తిగా ప్రభుత్వమే ఈ కార్యక్రమం ద్వారా భరిస్తోందన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఈ వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ షంషాద్ బేగం, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాల్వియసాల్మన్, కౌన్సిలర్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, కడప రంగస్వామి, చింతాయల్లయ్య, చింతా మారుతీ ప్రసాద్, సీనియర్ నాయకులు షేక్ చాంద్‌బాషా, మట్టిద్దుల కేశవరెడ్డి, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ జగదీష్, శ్రావణి, అప్తమాలజిస్ట్ ఉరుకుందప్ప, 40 వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లి సచివాలయంలో బుధవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరంలో 315 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనట్లు వైద్యాధికారులు బాబా పక్రుద్దీన్, మహేశ్వరమారుతి తెలిపారు. ఆరుగురిని ఉన్నత చికిత్సకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ నాగేంద్రకుమార్‌రెడ్డి, ఎంఎస్ (జనరల్), డాక్టర్ అనూరాధ, డీజీఓ, డాక్టర్ ఉపజ్ఞ, కంటి వైద్యులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలో లోచర్ల సచివాలయం వద్ద నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వారాం సాబ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల పరిధిలోని కొండగట్టుపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ నరసింహమూర్తి, డీఎల్‌డీఓ శివారెడ్డి, సర్పంచ్ పద్మావతి రమణారెడ్డి, ఈదులపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు తంబాపురంలో..

బత్తలపల్లి: తంబాపురంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్, సర్పంచ్ సానే జయచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కాళసముద్రం గ్రామంలో..

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నల్లచెరువు: అల్లుగుండులో గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెగా హెల్త్ క్యాంప్‌లో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొంటారని ఎంపీపీ రమణారెడ్డి, మండల కన్వీనర్ హైదర్‌వలి బుధవారం తెలిపారు. అలాగే 10 గంటలకు గొర్లవాండ్లపల్లి నుంచి నల్లజోడువారిపల్లి వరకూ నూతనంగా నిర్మించిన తారురోడ్డును ప్రారంభిస్తారన్నారు.

నవరత్నాలతో పేదలకు మేలు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రభుత్వం నవరత్నాలు పేరుతో అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 17వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ప్రతి ఇంటికి తిరుగుతూ పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పలువురు వార్డు ప్రజలు వార్డులో విద్యుత్‌లో ఓల్టేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి.. సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. మరికొంత మంది సాంకేతిక కారణాలతో తమకు వివిధ సంక్షేమ పథకాలు అందడం లేదని విన్నవించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడిన ఎమ్మెల్యే.. సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు సంక్షేమం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అమ్మఒడి, నాడు–నేడు, జగనన్న విద్యా, వసతి దీవెన తదితర పథకాల ద్వారా పేదలు ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. సచివాయల వ్యవస్థ ద్వారా సాచురేషన్ పద్ధతిలో అర్హులందరికి పార్టీలకతీతంగా పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని తెలిపారు.

సచివాలయం తనిఖీ

అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. వార్డులో కొత్తగా నిర్మించబోయే ఇళ్లకు మున్సిపల్ ప్లానింగ్ తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా ప్లాన్ అప్రూవల్ అయిన తర్వాతనే ఇళ్లు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పథకాల అమలులో ఏవైనా ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదని వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వన్నూరు స్వామి, కౌన్సిలర్ కేతాలోకేష్, సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నీలూరి ప్రకాష్, కో–ఆప్షన్ సభ్యుడు బూశెట్టి రామకృష్ణ, వార్డు ఇన్‌చార్జ్‌లు, నాయకులు కాచర్ల అంజి, సిద్దిరాజేష్, బడన్నపల్లి నరసింహులు, కాళంగి శ్రీన, చెలిమి పెద్దన్న, కేశగాళ్ల కృష్ణ, పరంధామి రెడ్డి, ఈడిగ వెంకటరమణ, బెస్త వెంకటరమణ, హాకీ చందు, విద్యుత్‌శాఖ ఏఈ కొండారెడ్డి, హౌసింగ్ ఏఈ బాలాజీ, ఏఎస్‌ఐ బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు 'డయల్ యువర్ మేనేజర్'

పుట్టపర్తి టౌన్: ఈనెల 6వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ డయల్ యువర్ మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపోకు సంబంధించి బస్సుల రవాణా, సమస్యలు, సలహాలు, సూచనలపై 9959225857 నంబర్‌కు కాల్ చేసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు. సమస్యలు నివృత్తి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్సిడీ రుణాలపై రేపు అవగాహన సదస్సు

బత్తలపల్లి: జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద ఔత్సాహిక నిరుద్యోగ యువకులకు సబ్సిడీ రుణాలు అందించేందుకు ఈనెల 6వ తేదీన పుట్టపర్తిలోని సాయి ఆరామంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ గుర్నాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. 50 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల వరకూ గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల యూనిట్లు, దాణా తయారీ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఔత్సాహిక నిరుద్యోగ యువకులు, గొర్రెల పెంపకందారులు, ప్రజా ప్రతినిధులు, అగ్రిబోర్డు చైర్మన్లు, కమిటీ మెంబర్లు హాజరుకావాలని కోరారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

తనకల్లు: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తపాలా ఉద్యోగులు మండల కేంద్రంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు. మాట్లాడుతూ.. 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు వర్తింజేయాలని కోరారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల ఇంక్రిమెంట్‌లను మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలన్నారు. కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. టార్గెట్స్ మేళాల రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు డి.శ్రీరాములు, భావన్న, రామాంజనేయులు, రాము, ఎంఎల్ఎం మూర్తీ, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, బయారెడ్డి, రమణానాయక్, రఘునాథరావు, సురేఖ, లీలావతి, రామకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్టాంపు పెంపుపై విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారావు

ధర్మవరం అర్బన్: కోర్టు పిటీషన్లకు రూ.1 స్థానంలో రూ.20 స్టాంపు వేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 16వ తేదీ వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. ధర్మవరంలోని కోర్టు బార్ అసోసియేషన్‌లో బుధవారం న్యాయవాదుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడారు. కోర్టుల్లో రోజూ వందల సంఖ్యలో న్యాయవాదులు తమ క్లైదారుల తరపున పిటిషన్లు దాఖలు చేస్తూ స్టాంపు అతికించేవారన్నారు. ఈ స్టాంపు స్థానంలో ఈనెల 5వ తేదీ నుంచి రూ.20 విలువ చేసే స్టాంపును అతికించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ఈ స్టాంపును వ్యతిరేకిస్తూ ఈనెల 16వ తేదీ వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు తీర్మానించారు. ఈ స్టాంపులపై నిర్ణయం వెనక్కి తీసుకునే దాకా ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్‌ఐకి వీడ్కోలు



ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని సన్మానించిన దృశ్యం

గాండ్లపెంట: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా పని చేసి, సాధారణ బదిలీల్లో భాగంగా ఓబులదేవరచెరువు(ఓడీసీ)కి బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ బత్తుల మల్లికార్జునరెడ్డిని గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ, వివిధ పార్టీల నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. తొలుత పోలీస్‌స్టేషన్ నుంచి మంగళ వాయిద్యాల మధ్య బాణాసంచా కాల్చుతూ స్థానిక ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వరకూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కదిరి డిఎస్పీ శ్రీలత అధ్యక్షతన ఎస్‌ఐను సన్మానించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ, సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రనాయక్, బీసీ కన్వీనర్ జక్కల లక్ష్మీ నరసింహాగౌడ్, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, ప్రతాపరెడ్డి, సర్పంచ్ రహంతుల్లా, నాయకులు హుస్సేన్‌పీరా, ఉత్తన్న, పామిడి ఇక్బాల్, బహువుద్దీన్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం



హరికృష్ణ

ధర్మవరం అర్బన్: అప్పుల బాధ తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ధర్మవరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన హరికృష్ణ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ పోషణకు అప్పులు చేసి వాటిని తీర్చలేక మనస్థాపానికి గురయ్యేవాడు. అప్పుల వారి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో మనోవేదనకు గురై బుధవారం ఇంటిలో సూపర్ వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుకుంట ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు సమస్యను విన్నవిస్తున్న రైతులు

ఎన్‌పీకుంట: చీమలచెరువుపల్లి గ్రామంలోని ద్వారనాల చెరువుకుంట ఆక్రమణకు గురవుతోందంటూ గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సర్వే నంబరు 60లో ద్వారనాల చెరువుకుంటకు ప్రభుత్వం 16.68 ఎకరాలు కేటాయించిందని తెలిపారు. ఇందులో చెరువుకు పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన పెద్ద రెడ్డప్ప, దిగువతూపల్లికి చెందిన శేఖర్ అనే రైతులు సుమారు మూడు ఎకరాలకు పైగా చెరువుకుంటను కబ్జా చేసి పంటలు సాగు చేయడానికి సిద్ధం అవుతున్నారన్నారు. అంతేకాకుండా ట్రాక్టర్‌తో మట్టిని, రాళ్లను తోలి కుంటను పూడ్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కబ్జాదారులకు నోటీసులు ఇచ్చి, చెరువుకుంట ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రవీంద్రారెడ్డి, మాకిరెడ్డి, నారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి గ్రామసభలు

కదిరి అర్బన్: ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకూ ఉపాధిహామీ పథకానికి సంబంధించి 12 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 13వ తేదీన సామాజిక తనిఖీ ప్రజావేదిక ఉంటుందని తెలిపారు. 8న యర్రదొడ్డి, 9 ముత్యాలచెరువు, బూరుగుపల్లి, కదిరికుంటపల్లి, 10న పట్నం, కుమ్మరవాండ్లపల్లి, కాళసముద్రం, మోటుకుపల్లి, కదిరి బ్రాహ్మణపల్లి, 11న ఎగువపల్లి, 12న చౌటితండా, చలమకుంట్లపల్లి, చిగురుమానుతండా, కేఎన్‌పాళెం పంచాయతీల్లో గ్రామసభలు ఉంటాయన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

పుట్టపర్తి అర్బన్: పలువురు సత్యసాయి భక్తుల సహకారంతో పుట్టపర్తికి చెందిన శ్రీవాణి బ్లోసమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పుట్టపర్తి మండలం గాజులపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్కేల్స్, దువ్వెనలు, తినుబండారాలు అందజేశారు. పిల్లలు అందరూ బాగా చదువుకోవాని సూచించారు. పాఠశాలలో అందరూ కలసిమెలసి ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు అవీన్, కేసరి, మీనా యేచూరి శ్రీవాణి, శ్రీనివాస్ ఏచూరి, అఖిల, రాజేశ్వరి, ఉపాధ్యాయులు సుజాత, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు ఉన్నారు.

బత్తలపల్లి ఎస్‌ఐగా శ్రీనివాసులు



బత్తలపల్లి: బత్తలపల్లి ఎస్‌ఐగా పి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిలమత్తూరు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై బత్తలపల్లికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష సీఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా, కర్ణాటక మద్యం, నిషేధిత గుట్కాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

నల్లచెరువు ఎస్‌ఐగా కెఎం లింగన్న



నల్లచెరువు: మండల నూతన ఎస్‌ఐగా కెఎం లింగన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గామీణ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా సారిస్తామన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బందితో కలిసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని కత్తేవారికొట్టాలకు చెందిన అనిత అనే మహిళ బుధవారం పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురైంది. వ్యవసాయ పొలాల వద్ద పశువులు మేపుతుండగా ప్రమాదవశాత్తూ పాము కాటు వేసింది. అక్కడే ఉన్న వారు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

ఫీజుల పేరుతో మానసిక వేధింపులు

ధర్మవరం రూరల్: ఫీజుల పేరుతో పట్టణంలోని విశ్వభారతి స్కూలు యాజమాన్యం విద్యార్థులను మానసికంగా వేధింపులకు గురిచేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు చెన్నయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజులు చెల్లించని వారిని స్కూలు బయట నిలబెడుతున్నారన్నారు. దీంతో విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

7న షాపింగ్ రూములకు వేలం

ధర్మవరం రూరల్: ఈనెల 7వ తేదిన పట్టణంలోని కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి మొదటి అంతస్తు బ్లాక్–1లోని 9 రూములు, అలాగే బ్లాక్–4లోని 2 రూములకు 7వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటను పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు మున్సిపల్ రెవెన్యూ విభాగంలో సంప్రదించాలన్నారు.

శీనా హోటల్‌కు నోటీసులు

కదిరి టౌన్: పట్టణంలోని శీనా హోటల్‌కు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు నోటీసులు జారీ చేశారు. వివరాలు.. ఇటీవల కలామ్ అనే వ్యక్తి శీనా హోటల్ నుంచి పలావ్ పార్శిల్ తీసుకెళ్లాడు. పలావ్‌లో చిన్న చిన్న రాళ్లు ఉండటంతో హోటల్ యజమాని భార్యతో కలామ్ గొడవకు దిగాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామచంద్ర హోటల్‌ను పరిశీలించారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ హోటల్ యజమానికి కమిషనర్‌తో నోటీసులు జారీ చేయించారు.

119 మందిపై కేసు నమోదు

కనగానపల్లి: అనుమతి లేకుండా బహిరంగ ర్యాలీ నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన 119 టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల కేంద్రం కనగానపల్లిలో బుధవారం మాజీ మంత్రి పరిటాల సునీత, శ్రీరామ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమతి లేకుండా వారు మైకులతో గ్రామంలో బహిరంగ ర్యాలీ నిర్వహించారు. దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులను కూడా తోసివేశారు. దీంతో ఈ ర్యాలీలో పాల్గొన్న పరిటాల సునీత, శ్రీరామ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, మండల నాయకులు నెట్టం వెంకటేశులు, ముకుందనాయుడుతో కలిపి సుమారు 119 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.